క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



దుత్తలూరు : మండలంలోని నర్రవాడ పంచాయతీ పరిధిలోని ఉలవవారిపాళెంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపారు. అనంతరం సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సచివాలయ సర్వేయర్ల నిరసన



సంగం : మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సచివాలయ సర్వేయర్లు శనివారం నిరసన తెలిపారు. బదిలీలకు సంబంధించిన జీఓ నంబర్ 5ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సోమ్లానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సర్వేయర్ల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.

పది బాటిళ్ల మద్యం స్వాధీనం

కావలి (జలదంకి) : కావలిలోని మానికలవారివీధికి చెందిన డీ వంశీకృష్ణారెడ్డి ఇంట్లో 750 మి.లీ. పరిమాణం కలిగిన పది ఫుల్‌బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. తమిళనాడుకు చెందిన మిలటరీ మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఉత్తమ నవలగా ‘కిలారి’

నెల్లూరు(బృందావనం): సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జొన్నలగడ్డ రాంభొట్లు - సరోజనమ్మ స్మారక-2024 నవలా రచన పోటీల ఫలితాలను ఆ సంస్థ నిర్వాహకుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం శనివారం ప్రకటించారు. ఉత్తమ నవలగా సమగ్ర గ్రామీణ జీవితాన్ని ఆవిష్కరిస్తూ డాక్టర్ బి.నాగేషు రచించిన నవల ‘కిలారి’ ఎంపికైంది. ప్రత్యేక బహుమతులకు మూడుతరాల నారీ చేతనకు అద్దంపడుతూ రెంటాల కల్పన రచించిన ‘కావేరికి అటూ ఇటూ’, నల్లమల అడవుల్లోని చెంచుల జీవితాన్ని అత్యంత సన్నిహితంగా పరిచయం చేస్తూ రంజిత్‌గన్నోజు రచించిన ‘లింగాల కంఠంలో’ను ఎంపిక చేసినట్లుగా నిర్వాహకుడు వెల్లడించారు. ఆయా నవలలకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులను అందజేయనున్నట్లు వివరించారు. నాలుగేళ్లుగా అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న నవలా పోటీలకు రచయితలు స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన భర్త, మరికొందరిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ఆబిదాకు, కసుమూరుకు చెందిన రియాజ్‌తో 2015లో వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబ సభ్యులు రియాజ్‌కు ఘనంగా కట్నకానుకలిచ్చారు. కొంతకాలం తర్వాత భర్త, అత్తింటివారు ఆమెను అదనపు కట్నం కోసం వేధించసాగారు. పెద్దమనుషుల సూచనల మేరకు దంపతులు బుజబుజనెల్లూరులో వేరుగా కాపురం పెట్టారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో ఆబిదా ఈ ఏడాది జనవరిలో పుట్టింటికి వెళ్లింది. బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ రెన్యువల్ చేయించాలని రియాజ్ కోరడంతో ఆమె ఈనెల 20వ తేదీన తన తల్లి, అన్నతో కలిసి బుజబుజనెల్లూరుకు వచ్చింది. అక్కడ దంపతుల నడుమ మాటామాటా పెరిగింది. రియాజ్ భార్యపై చేయి చేసుకున్నాడు. అడ్డు వెళ్లిన ఆమె తల్లి, అన్నపై రియాజ్ సోదరుడు దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు శనివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలంటూ..

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా యూనిఫామ్, పుస్తకాలను విక్రయిస్తున్న శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని శ్రీచైతన్య పాఠశాలల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. యూనిఫామ్ నుంచి బూట్ల వరకు అన్నింటిని అధిక రేట్లకు విద్యార్థులకు బలవంతంగా అంటగడుతూ రూ.కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

పర్యవేక్షణ లోపం.. గాడితప్పుతున్న పాలన

- ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ను వేధిస్తున్న సిబ్బంది కొరత
- అదనపు బాధ్యతలతో సీడీపీఓ సతమతం
- తొమ్మిది సెక్టార్లకు ఒక్కరే సూపర్‌వైజర్
- బదిలీపై వెళ్లిన జూనియర్ అసిస్టెంట్
- సిబ్బంది భర్తీపై దృష్టి సారించని అధికారులు
- పక్కదారి పడుతున్న సరుకులు



ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రాజెక్ట్‌కు రెగ్యులర్ సీడీపీఓ లేరు. దీనికితోడు ప్రాజెక్ట్ పరిధిలో తొమ్మిది సెక్టార్లు ఉండగా కేవలం ఒకే ఒక్క సూపర్‌వైజర్ ఉన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పలువరు సూపర్‌వైజర్లు వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. కొత్తగా ఇక్కడకు ఎవరూ రాకపోవడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సూపర్‌వైజర్ల కొరత ఏర్పడింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ లోపించింది. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన, పోషకాహారం పంపిణీ గాడితప్పింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలో తొమ్మిది సెక్టార్లు ఉన్నాయి. సీతారామపురం మండలంలో సీతారామపురం, ఎస్సార్‌నగర్, ఉదయగిరి మండలంలో ఉదయగిరి-1,2, 3 సెక్టార్లు ఉన్నాయి. దుత్తలూరు మండలంలో దుత్తలూరు, నర్రవాడ, వరికుంటపాడు మండలంలో పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు సెక్టార్లు ఉన్నాయి. వీటి పరిధిలో 208 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. సెక్టారుకు ఒక్క సూపర్‌వైజర్ చొప్పున తొమ్మిది మంది ఉండాలి. కానీ ప్రస్తుతం ఉదయగిరి-2 సెక్టార్‌కు మాత్రమే సూపర్‌వైజర్ ఉన్నారు. మిగిలిన సెక్టార్లను కూడా ఆమె పర్యవేక్షించాలి. కానీ అది ఆచరణలో సాధ్యం కాదు. దీంతో పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. కొన్ని సెక్టార్లకు యాక్టివ్ సూపర్‌వైజర్లుగా అంగన్‌వాడీ కార్యకర్తలను నియమించినా వారి మాటను సహచర సిబ్బంది వినడం లేదు. దీంతో వారు కేవలం డేటా సేకరణకు మాత్రమే ఉపయోగపడుతున్నారు. ఉదయగిరి సీడీపీఓగా పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో నెల్లూరు కార్యాలయంలో పనిచేస్తున్న అధికారిణికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆమె కూడా అదనపు బాధ్యతలతో సతమతమవుతూ కేంద్రాలను పర్యవేక్షించడం లేదు. అలాగే ప్రాజెక్ట్ కార్యాలయంలోని టైపిస్ట్ పోస్టు కొన్నేళ్లుగా భర్తీ కాలేదు. జూనియర్ అసిస్టెంట్ ఉన్నా ఇటీవల బదిలీల్లో గూడూరు వెళ్లారు. డీఈఓ మెడికల్ లీవులో ఉన్నారు. పోషణ్ అభియాన్ కో-ఆర్డినేటర్ మాత్రమే ఉన్నారు. అతను కూడా ఔట్‌స్సోరింగ్‌కు సంబంధించిన వ్యక్తి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాజెక్టు కార్యాలయంలో ఒక్కరూ కూడా రెగ్యులర్ ఉద్యోగి లేరు.

సూపర్‌వైజర్ల భర్తీపై దృష్టి సారిస్తేనే..

ఉదయగిరి ప్రాజెక్ట్ జిల్లా కేంద్రానికి 100 కి.మీ దూరంలో ఉంది. దీంతో ఇక్కడ పని చేసేందుకు ఈ ప్రాంతంకు చెందిన ఉద్యోగులు తప్ప నెల్లూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఇష్టపడరు. అంతేకాకుండా ప్రాజెక్టులో పనిచేసే కొంతమంది అంగన్‌వాడీలు యూనియన్ల పేరుతో అంతర్గత విబేధాలతో ఉద్యోగులపై పడుతుండడం.. ఉద్యోగులు సైతం గ్రూపులుగా విడిపోతుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో పని చేసేందుకు కొత్తగా వచ్చే సూపర్‌వైజర్లు జంకుతున్నారు. నిజాయతీగా తమ విధులు నిర్వహిస్తూ, వసూళ్లకు పాల్పడకుండా కేంద్రాలను గాడిలో పెట్టే సూపర్‌వైజర్లు వస్తే ప్రాజెక్టుకు పూర్వవైభవం వస్తోందని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సూపర్‌వైజర్ల కొరతను తీర్చాలని వారు కోరుతున్నారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారిణి హేనాసృజన గతంలో ఉదయగిరి ప్రాజెక్ట్ అధికారిణిగా విధులు నిర్వహించి ఉన్నారు. ఉదయగిరి ప్రాజెక్ట్‌పై ఆమెకు పూర్తి అవగాహన ఉన్న నేపథ్యంలో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రాజెక్ట్‌ను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలోని అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు పీజీటీ-1, ఇంగ్లిష్ పీజీటీ-1, టీజీటీ-1, గణితం పీజీటీ-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పీజీటీ పోస్టులకు 50 శాతం మార్కులు తగ్గకుండా బీఈడీ పూర్తి చేసిన, టీజీటీ పోస్టుకు బీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సాధించిన మహిళలు అర్హులైన తెలిపారు. డిప్యూటీ డీఈఓ ఆధ్వర్యంలో అభ్యర్థుల బోధనాపటిమను పరిశీలించి ఎంపిక చేస్తామని చెప్పారు. అర్హులైన వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈనెల 25వ తేదీలోగా గురుకులంలో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛభారత్



ఏఎస్‌పేట(ఆత్మకూరు): అనుమసముద్రంపేట తహశీల్దారు కార్యాలయంలో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. తహశీల్దారు కె అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వయంగా కార్యాలయం ఆవరణలోని చెత్తాచెదారం ఏరివేసి శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని అధికారులు శుభ్రంగా ఉంచుకుని ఆహ్లాదకర వాతావరణంలో విధులు నిర్వహించాలని తహసీల్దార్ కోరారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్యౌషధం



ఆత్మకూరులోని బాలికల గురుకుల పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు



కావలిలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి



వింజమూరులో యోగాసనాలు వేస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



యోగా చేస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్యౌషధమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని వ్యవసాయ క్షేత్రంలో శనివారం నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అధికారులు, నాయకులు, ప్రజలతో కలిసి యోగాసనాలు వేసి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా క్రమం తప్పకుండా ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. అలాగే ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్, ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ కామేశ్వరి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. అలాగే ఆత్మకూరు, సంగం, అనుమసముద్రంపేట, మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లోని మండల కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కావలి (జలదంకి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణంలోని మినీ స్టేడియంలో పురపాలక శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఎస్పీ శ్రీధర్ తదితరులు జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యోగా గురువులతో కలిసి ఎమ్మెల్యే, అధికారులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు యోగాసనాలు వేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఉదయగిరి: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. వింజమూరు జెడ్పీహైస్కూల్, దుత్తలూరులోని ఆదర్శ పాఠశాల ఆవరణలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అధికారులు, నాయకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. తహసీల్దార్ నాగరాజు, ప్రిన్సిపల్ సైమన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయగిరి, కలిగిరి, వరికుంటపాడు, సీతారామపురం, జలదంకి, కొండాపురం మండలాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



యోగాసనాలు ప్రదర్శిస్తున్న ‘ఆదర్శ’ విద్యార్థులు

న్యాయం చేయాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

సీతారామపురం : తమకు వారసత్వంగా వచ్చిన భూమిని మరో వ్యక్తి రెవెన్యూ అధికారుల సహకారంతో తన పేరుపైకి మార్చుకున్నాడని, తమకు న్యాయం చేయాలని పది నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీతారామపురానికి చెందిన పలువురు బాధితులు వాపోయారు. శనివారం వారు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 147-4లోని 37 సెంట్ల భూమి ఆదోని శేషయ్యకు వారసత్వంగా రాగా ఆదోని నాగయ్య అనే వ్యక్తి అగ్రిమెంట్ ద్వారా అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నాడని వాపోయారు. ఆ భూమి తమకు చెందిందని అన్ని రకాల పత్రాలను చూపినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. పక్కపొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసుకుని అవి కూడా తమవేనని విద్యుత్ శాఖ అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి సమస్యలు సృష్టిస్తున్న ఆదోని నాగయ్యపై చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. స్పందించిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు.

లారీని ఢీకొన్న బొలెరో



లారీని ఢీకొని దెబ్బతిన్న బొలెరో వాహనం -మహిళకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రురాలు రమాదేవి

కొడవలూరు: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలోని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ఎన్వీ ప్రసాద్‌రావు తెలిపిన వివరాల మేరకు.. కావలికి చెందిన పులి మహేంద్రరెడ్డి భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలతో కలిసి బొలెరో వాహనంలో సొంత పనిపై నెల్లూరు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి అదే వాహనంలో కావలికి వెళుతున్నారు. ఈ క్రమంలో నాయుడుపాళెం వద్ద అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బొలెరోలో ఉన్న రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. మహేంద్రరెడ్డి, ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రురాలిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ప్రిన్సిపల్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తొలిరోజు 1 నుంచి 15వేల ర్యాంకు వరకు సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.22వ తేదీ 15వేల నుంచి 32 వేల వరకు 23వ తేదీ 32వేల నుంచి 50వేల వరకు, 24వ తేదీ 50వేల నుంచి 68వేల వరకు, 25వ తేదీ 68 వేల నుంచి 86 వేల వరకు, 26వ తేదీ 86వేల నుంచి 1,04,000 వేల వరకు, 27వ తేదీ 1,04,000 నుంచి 1,20,000 వరకు, 28వ తేదీ చివరి రోజు 1,20,000 నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ,ఎస్టీలు రూ.250 ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్, తదితర బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివశంకర్‌రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వానికి, పాత్రికేయులకు వారధిగా ఉండే సమాచార శాఖలో మెరుగైన సేవలు అందించాలని మంత్రి సూచించారు. ఆయనతో పాటు డివిజనల్ పీఆర్వోగా బదిలీపై వచ్చిన రవికుమార్ కూడా మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు



సంగం: గాయపడిన గుర్తుతెలియని యువకుడు

సంగం: ఆత్మకూరు, సంగం మండలాల్లో శనివారం చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సంగం మండలం కొరిమెర్ల వద్ద ట్రాక్టర్‌ను వెనుకగా ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనచోదకుడు గాయపడ్డాడు. వివరాలు.. కొరిమెర్ల గ్రామానికి చెందిన రైతులు ట్రాక్టర్‌లో సంగంకు వచ్చి పనిముట్లు తీసుకుని తిరిగి వెళ్తూ కలిగిరి రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ఎడమవైపునకు తిరుగుతున్నారు. ఈ క్రమంలో వెనుకగా వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు గమనించక ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆత్మకూరుకు తరలించారు. యువకుడి వివరాలు తెలియరాలేదు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- ఆటో ఢీకొనడంతో..

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో నిెల్లూరుపాళెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్మకూరు మేజర్ చెరువు సాగునీటి సంఘం చైర్మన్ మాదాల మస్తాన్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరుపాళెం సెంటర్ సమీపంలో తాను నిర్వహిస్తున్న లారీ కాటా వద్దకు బైక్‌పై వెళ్తున్న క్రమంలో నెల్లూరు నుంచి వస్తున్న ట్రక్కు ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన మస్తాన్‌నాయుడు తలకు తీవ్రగాయాలయ్యాయి. అప్పటికప్పుడే బంధువులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. బ్రెయిన్‌డెడ్ అవ్వడంతో కోమాలోకి వెళ్లినట్లుగా బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువత పోరు జయప్రదానికి పిలుపు

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నెల్లూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న యువతపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉదయగిరి నియోజవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసిందని చెప్పారు. అందుకు నిరసనగా నెల్లూరులోని పాత జెడ్పీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరుద్యోగ యువతతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆశాకార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జలదంకి: చామదల సచివాలయం పరిధిలో ఆశాకార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని జలదంకి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు శనివారం తెలిపారు. చామదల గ్రామానికి చెంది ఉండి పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన 25 నుంచి 45 ఏళ్లలోపు కలిగిన వారు అర్హులైన చెప్పారు. వితంతువులు, విడాకులు పొందిన, నిరాశ్రయులైన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. జలదంకి పీహెచ్‌సీలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కలిగిరిలో 338 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి : స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 338 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 503బేళ్లను తీసుకురాగా, 388 బేళ్లను కొనుగోలు చేశారని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకుకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సరాసరిన రూ.226.15 ధర పలికిందని వివరించారు. వేలంలో పదహారు కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

ప్రభుత్వ సాయం అందజేత



కావలి (జలదంకి) : కావలి పట్టణంలోని జనతాపేటకు చెందిన కోటపూడి శ్రీనివాసులుకు ఇటీవల టీబీ వ్యాధికి గురై చికిత్స పొంది కోలుకున్న నేపథ్యంలో ప్రభుత్వం సాయం రూ.3వేలు నగదును ఆశాకార్యకర్త కల్యాణి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వరనాయుడు, నాయకులు చుండి కౌశిక్, కన్నే బాలకృష్ణ, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానంలో కొలువైయున్న శ్రీమహాలక్ష్మి గోదా సమేత శ్రీగురువాయూర్ మహావిష్ణు స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మహావిష్ణువుకు తిరుకల్యాణమహోత్సవం కనులపండువగా జరిగింది. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం స్థానాచార్యులు ఉభయ వేదాంత శ్రీమాన్ కొమాండూరు ఇళైయవిల్లి స్థలశాయి స్వామి ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణోత్సవాన్ని సంప్రదాయంగా జరిపారు. తొలుత మహాకుంభారాధన, నిత్యహోమం, నివేదన, శాత్తుమొరై భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువైన స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఉభయకర్తలుగా గంటా రమణయ్య నాయుడు, ప్రమీల దంపతులు, భక్తబృందం వ్యవహరించింది. ఈ కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య సభ్యులు పర్యవేక్షించారు.

ఆయుర్వేద వైద్యుడికి సత్కారం

నెల్లూరు(అర్బన్): నగరంలోని మూలపేటలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆయుర్వేద వైద్యశాలలో పనిచేస్తూ బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళుతున్న ఆయుర్వేద వైద్యుడు గోవిందయ్యను అక్కడి ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. పలువురు డాక్టర్లు, సిబ్బంది మాట్లాడుతూ గోవిందయ్య ఇక్కడ బాధ్యతలు చేపట్టిన నాలుగేళ్లలో ఆయుర్వేదానికి విస్తృత ప్రచారం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు యోగా గురువులు పాల్గొన్నారు.